# ఏమి చెప్పేది?

ఆ రోజు నాకు పోస్టులో వచ్చినవి నాలుగు ఉత్తరాలు.

ఒకటి : నా చిరకాల మిత్రుడు అన్న మాట ప్రకారం నేను కథరాసి ఇవ్వనందుకు నన్ను 'గాడిదా' అని సంబోధిస్తూ నేనెందుకు గాడిదనయానో విపులంగా రాసిన ఉత్తరం.

రెండు : మా ఆవిడ క్రితం దసరాకి కొన్న కోయంబత్తూరు చీరల బాపతు 200 అర్జంటుగా కట్టమని బట్టల షాపు నుంచి శ్రీముఖం. మూడు : మా పెద్దవాడు అనవసరంగా కథలు గట్రా రాస్తూ చదువు పాడు చేసుకుంటున్నాడని, ఈ లెక్కన వాడిని కాలేజీలోంచి తీసెయ్యాల్సి ఉంటుందని వాళ్ళ కాలేజీ ప్రిన్సిపాల్ విశాఖపట్నం నుంచి చేసిన హెచ్చరిక. నాలుగోది : శ్రీకంఠయ్య రాసిన ఉత్తరం. స్థూలంగా రెండు వాక్యాలు. సరస్వతి నిన్ననే ఆస్పత్రిలో పోయింది – కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉందని. గుండెలో రక్తప్రసారానికి అభ్యంతరం ఏర్పడి కన్ను మూసిందని డాక్టరు అంటున్నారు అని.

చాలా విలువయిన పాతపుస్తకంలోంచి కాగితం చిరిగిపోయినట్లుగా మనసు చివుక్కుమంది. సాయంకాలం వేపు పరుగులు తీస్తున్న ఈ యిరుకయిన జీవితంలో సరస్వతి ఓ పాత జ్ఞాపకం. అలసిపోకుండా ముందుకు, వెనక్కు పరుగులు తీసే సముద్రం కెరటాలు, జివ్వుమనే మంచుముద్ద స్పర్శ, తడిసి ముద్దయిపోతూ వర్షంలో నడుస్తున్నప్పుడు కాలికిగి గుచ్చుకొనే ముల్లు నొప్పి – ఇలాంటి చిన్నచిన్న అనుభవాల సమష్టి రూపం సరస్వతి.

దగ్గర్లో యిసికలో కూర్చుని గుజ్జనగూళ్ళు ఆడుకొంటున్న నామనుమల్ని చూశాను. ఎదురుగా తడిబట్టలారేస్తున్న మా ఆవిడ. పాతికేళ్ళ క్రితం నేనుకాస్త పొగరుగా అల్లరి చిల్లరగా ప్రవర్తించి ఉంటే ఆ ఆ స్థానంలో సరస్వతి ఉండేది. అప్పుడా పనులన్నీ సరస్వతి నన్నే చేయమనేదేమో! నా మనవలు ఎలా ఉండేవారో! మా పెద్దవాడు అనవసరంగా కథలు రాసేవాడు కాడేమో. నా జుత్తు అక్కడా అక్కడా నెరిసిపోతోంది. నాది మా అమ్మ పోలిక. సాహితీ లోకంలోంచి సెలవు తీసుకుని చాలా ఏళ్ళయింది. ఈ మధ్య నారచనల గురించి ఎవరూ మాట్లాడుకోవడం లేదు. నా అభిప్రాయాలు చాలామట్టుకు కాలదోషం పట్టిపోయాయి. నాలాగే నా అభిప్రాయాలకి వయసు మించిపోయింది గావును. నా కొడుకు రాసే కథల్లో ఏం చెప్తున్నాడో క్కొసారి రాసి కనుక్కోవాలనిపించింది. వాడిని అభినందించడానికి కాదు. నా ముందుతరం నన్ను పక్కకి తోసివెయ్యడానికి ఏ కొత్త అర్హతలు సంపాదించుకొందో తెలుసుకోడానికి.

నిన్న సరస్వతిని చూస్తే ఎలా ఉండేదో? మనస్సులో గుర్తున్న ఆ ముఖానికి కాస్త ముడతలు అతికించి, జుత్తుకు తెల్లరంగు వేసి, పెద్ద ఫ్రేము కళ్ళద్దాలు పెట్టి చూసుకున్నాను. సరస్వతిలో వృద్ధాప్యం చాలా గంభీరంగా ఉంటుంది చూడగలిగితే. నిజానికి ఆమెలో వృద్ధాప్యపు ఛాయలు చాలాకాలం నుంచి ఉన్నాయనిపించింది. మానసికంగా నాకు తెలిసిన నా గంభీరమయిన వ్యక్తి సరస్వతి.

శ్రీ కంఠయ్య పెళ్ళి చేసుకుని యిర్వై ఏళ్ళయింది. వాళ్ళిద్దరికి పిల్లలు లేరని, ఒకటి రెండుసార్లు అబార్షన్లు అయాయని ఎప్పుడో నిడదవోలులో ఒకసారి శ్రీకంఠయ్య కనిపించి చెప్పాడు.

అది శ్రీ కంఠయ్యను నేను కలుసుకోవడం రెండోసారి. తెల్లగా బట్టతలలో నిటారుగా సన్నగా ఉన్న విగ్రహం. బట్టతల వాళ్ళ కుటుంబంలో ఆనవాయితీట. ఈ బట్టతల లేకపోతే సరస్వతిని చేసుకొనేవాడిని కాదు అనడం శ్రీకంఠయ్యకు అలవాటయిన జోక్. నిలబడిన చోట నిలబడకుండా, చెప్పినమాట చెప్పకుండా హుషారుగా ఉండే మనిషి. ఏదో బ్యాంకులో కాషియర్‌గా ఉండేవాడు. ఒకసారి పదివేలు మాయం చేశాడని అతన్ని బర్తరఫ్ చేశారు. 'నిజమేనా' అని సరస్వతిని అడిగాను.

"పూర్‌ఫెలో! చేస్తూ చేస్తూ పదివేలామాయం చెయ్యడం? దొంగతనానికి బొత్తిగా నా విలువ లేకుండా చేశాడు. కనీసం పేపర్లో ఫోటో అయినా వెయ్యలేదు, ఏమిటా చచ్చు దొంగతనం" అంది.

శ్రీకంఠయ్య తర్వాత ఎక్కడా ఉద్యోగం చేయలేదు. ఏలూరులో స్టేషనరీ దుకాణం పెట్టాడు. తర్వాత ఒకటి రెండు నవలలు అచ్చువేశాడు. ఆ వ్యాపారం దివాలా తీసేముందు అచ్చేసిన ఆఖరి నవల నాదే.

ఒక్కొక్కసారి జీవితంలో ఓడిపోతున్నప్పుడల్లా శ్రీకంతయ్య కృంగిపోయేవాడు కాని, సరస్వతి ఆనందిస్తూండేది. జీవితం నియమబద్ధంగా, పాకుడుపట్టిన చెరువు నీటిలాగ ఉండకూడదని సరస్వతి ఉద్దేశం. అది పారుతూ, పాటలు పాడుకుంటూ ప్రవహించాలి. మధ్యలో రాళ్ళూ, రప్పలూ, మొక్కలూ, చెట్లూ అన్నీ ఉంటాయి. వాటిని సముదాయించి పలకరిస్తూ పోతూ ఉండాలి. ఈ గంభీరమయిన జీవనశక్తి, తెగింపు, పరుగులు తీసే బలమయిన మనస్తత్వం, ఓటమిలోనే ఆత్మస్థైర్యాన్ని పూరించుకొనే ధైర్యం ఇవన్నీ సరస్వతిని విలక్షణమయిన వ్యక్తిని చేశాయి.

* * * * *

పాతికేళ్ళ క్రిందట నా చదువు పూర్తయిన తొలిరోజుల్లో మిత్రులతో కలిసి సింహాచలం పిక్‌నిక్ వెళ్ళినప్పుడు మొదటిసారి సరస్వతి కనిపించింది. విరగబూసిన గన్నేరు చెట్ల మధ్య పరుగులు తీస్తూ మధ్యమధ్య ముళ్ళ కంచెల అవతల వేలాడే మామిడికాయల్ని రాళ్ళేసి కొట్టి రాలుస్తూ – ఆ రోడ్డంతటినీ తన యౌవన సామ్రాజ్యం చేసుకొంది. సరస్వతి నవ్వడానికి పెద్దకారణం అక్కరలేదు. చిన్న విషయానికే సుడులు తిరిగిపోతూ నవ్వుతుంది. అసలు ప్రతిచిన్న విషయం నవ్వడానికి అర్హమయిందాకాదా అని ఆలోచిస్తుంది గావును. ఆ మధ్యాహ్నం కొండమీద పనస చెట్లకింద మేమంతా కూర్చుని మధ్యాహ్న భోజనాలు చేస్తున్నప్పుడు ఉన్నట్లుండి మామధ్యకి వచ్చింది. కాస్త ఎడంగా మిగతా స్నేహిరాళ్ళంతా ఉన్నారు.

చేతిలో పులిహోర తింటున్న కాగితపు పొట్లం. మీలో ఫలానా రచయిత ఎవరు అని సూటిగా అడిగింది. కథలకి కారణాలు వెదుక్కుంటున్న రోజులవి. నా రచన అంత అందమయిన అమ్మాయిలో ఆసక్తి రేపినందుకు ఆనందపడుతూ నేనే అన్నాను. "మీరా! మీరు రచయితలాగ లేరే! పరీక్ష ఎగ్గొట్టిన హైస్కూల్ స్టూడెంటులాగ ఉన్నారు" అని నవ్వింది.

మా మిత్రుడు ఫక్కున నవ్వేశాడు.

"ఏం లేదు. సారీ నా పులిహోర పొట్లం మీద మీ కథ సగభాగం ఉంది. మీపేరు ఎవరో చెప్పారు. నా మధ్యాహ్న భోజనానికి యింత రుచికరమయిన ఆహారంగా మీ కథ ఉపయోగించినందుకు మీకు అభినందనలు చెప్పాలని వచ్చాను" అంది.

అదే సరస్వతితో నా మొదటి పరిచయం. నా సమర్థత పూర్తిగా ఓడిపోయిన మొదటి వ్యక్తి సమక్షం అది. రచయితగా అవతరించాలని కలలు కంటున్న కొత్త రోజులు. మరి యిలాంటి ఎదురు దెబ్బ తగిలేసరికి తల తిరిగిపోయింది. ఆ క్షణంలో ఆమె కోటేరిన ముక్కు, అందమయిన కళ్ళూ, చిక్కటి చిరునవ్వు ఏవీ నన్ను మోసం చెయ్యలేక పోయాయి. ఆరోజే ఆమెని జీవితంలో మొదటిసారిగా, రహస్యంగా అభిమానించాను. ఆమె

నన్ను అవమానించగలిగినందుకే ఆ క్షణంలో ఆనందపడ్డాను. వారం రోజుల తర్వాత వరంగల్లు నుంచి నాకో ఉత్తరం వచ్చింది. అదిగో అప్పుడే ఆ అమ్మాయి పేరు సరస్వతి అని నాకు తెలిసింది. నిజానికి సింహాచలం, పులిహోర పొట్లం గుర్తు చెయ్యకపోతే నాకావిషయం, ఆ వ్యక్తి గుర్తుకొచ్చేదేకాదు. అలా ఆమె విమర్శించగలగడమే ఆమెలో శక్తి అని తర్వాత తర్వాత అర్థం చేసుకున్నాను. చేప మొప్పలతో నీళ్ళు తాగడంలాగ, తేనెటీగ పువ్వులో తేనెని పీల్చుకోవడంలాగ, సూర్యుడు తూర్పున ఉదయించడమంత సహజమయిన ప్రకృతి సరస్వతిది. విమర్శ లేకపోతే ఆమెలో సగం అందటం లేదు. ఉ ఉత్తరం నన్ను సరస్వతి గురించి మరొక్కసారి ఆలోచించేటట్టు చేసింది. ఇప్పుడు సరస్వతి జ్ఞాపకంగా చికిలించే ఆమె కళ్ళూ, వెలిగి ఆరే నియోన్‌లైట్‌లాగ తళుక్కుమనే చిరునవ్వు గుర్తొకొచ్చాయి. అయితే ఆమె విమర్శించింది నా రచనని. ఆమెని ఏవిధంగా చూసినా క్షమించలేకపోయాను. తర్వాత చాలా రోజులు మా ఇద్దరి మధ్య కోల్డువార్ ఉత్తరకాండగా సాగింది.

ప్రతీ ఉత్తరంలోనూ కొత్త కారణాలకి నా బలహీనతల్ని విమర్శించేది. నేను మరింత రెచ్చిపోయేవాడిని.

కాని రచనని మినహాయిస్తే నా అంత బలహీనుడు లేడని సరస్వతి గుర్తించలేకపోయింది.అప్పట్లో నేనూ గుర్తించలేదు. నా ఆత్మస్థైర్యమంతా నా వృత్తిది. వ్యక్తిది కా[illegible] ఆమె తిరుగుబాటు ఆమె వ్యక్తిత్వం. నా పొరపాటుని లేదా దురభిప్రాయాన్ని ఎ[illegible]ుడు ఎత్తిచూపే ఫిమేల్‌ఇగో స్థూలంగా సరస్వతి వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వపు గాంభ[illegible]న్ని నేను ప్రేమగా దురభిప్రాయ పడానికి చాలాకాలం పట్టింది. కాని అప్పటికీ, ఎప్పటికీ నన్ను సమీక్షకు నిలిపే ఉన్నతాసనంలోనే సరస్వతి ఉంటూ వచ్చింది. సంవత్సరం తర్వాత – ఈ ఉత్తరాలకి అర్థం ప్రేమేమోనని రాశాను. "అయితే ఏం?" అని సమాధానం. నేను ఫాల్‌ని – ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తుంది. రెండో ఉత్తరంలో నేను ప్రేమిస్తున్నానని రాసి ఉంటే సరస్వతి వెంటనే సమాధానం రాసేది. "ప్రేమించు నీ ఖర్మ" అని.

మా బాంధవ్యానికి ప్రేమ అని గుర్తు పెట్టుకున్నాక. నాలో చాలా మార్పులు జరిగాయి. స్వభావంలో తీవ్రత కరిగిపోయింది. దానిస్థానే అభిమానం, ఆమె విమర్శల పట్ల నిష్ఠూరంగా పడే బాధ, నన్ను సరిగ్గా అర్థం చేసుకోలేక పోయిందనే మదన–ఇలాంటివేవో చోటు చేసుకున్నాయి. నా ఉత్తరాలలో విరివిగా ప్రేమ కవిత్వం, ఉదయసంధ్యలో ఒంటరితనాలూ, విరహం, కోయిల అరుపులూ మొదలైనవన్నీ చోటు చేసుకున్నాయి. ఆ ఉత్తరాలకి సరస్వతి బోర్ అయ్యేది. ఆ మాట ఒకటి రెండుసార్లు సూటిగా రాసింది కూడాను. "ఏమిటా నాన్సెన్సు – నా గురించి ఆలోచిస్తూ సముద్రాన్ని చూస్తూ సిగరెట్టుతో చెయ్యి కాల్చుకోవడమేమిటి నీ ముఖం. అంత వొళ్ళు తెలీకుండా" అంది.

చాలా నెలల తర్వాత – ఏదో ఉద్యోగరీత్యా తను రాజమండ్రి వచ్చినప్పుడు నేనూ పనిగట్టుకొని సరస్వతిని కలుసుకోడానికి వెళ్ళాను. అంతవరకు నా ఆలోచనల్లో ప్రేమ సరస్వతిని మరింత అందంగా తీర్చిదిద్దతే కాలం ఆమెను మరింత గంభీరంగా తయారు చేసింది. ఇప్పుడు కళ్ళజోడు పెట్టుకుంది. నవ్వు కాస్త తగ్గింది.

మా ఇద్దరి మధ్య సింహాచలం సంఘటన నాటి వెసులుబాటు ఎందుకో తగ్గిపోయింది. దాని కారణం ప్రేమని ఇవాళ గుర్తు పట్టగలను. బాధ్యతల్ని, వ్యక్తిత్వాన్ని ఎరుకపరుచుకొని ఒకరికొకరు చిరపరిచుతల్లాగ కలిసిన సందర్భం ఇది.

నాకారోజు బాగా గుర్తు. అన్ని దస్త్రాల ప్రేమని కాగితాల నిండా గుప్పించిన నేను– ఏకాంతాన్ని కోరుకొంటానని ఊహించి నన్ను గోదావరి ఒడ్డుకి తీసుకెళ్ళింది. లాకులు వేపు నడిపించింది. కాని అపరిచిత వ్యక్తిపట్ల నేను అవమానించడానికి పెట్టుకున్న గుర్తు పరిచితమయిన వ్యక్తి ప్రేమకు పెట్టుకుంటుందని గురు పట్టలేకపోయాను. నన్ను కలిశాక చాలా పెద్ద బోర్‌గా భావించి ఉంటుంది.

నీతికీ, స్వేచ్ఛకీ విచిత్రమయిన లంకె ఉంది. నీతి పేరిట మనం చాలాసార్లు మన స్వేచ్ఛని వదులుకొంటాం. సరస్వతికి మగాడిలో బలహీనతలు కావాలి. వాటిని ఎప్పటికప్పుడు విమర్శించే అవకాశం కావాలి. కాని ఆమె విమర్శని సజావుగా అర్థం చేసుకొని ఆ బలహీనతకి విడాకులిచ్చి నేను దూరమయ్యాను. వాటిని నిలుపుకోగలిగిన శ్రీకంతయ్య పెళ్ళి చేసుకొన్నాడు.

నేను సరస్వతిని పెళ్ళి చేసుకొన్నా చాలా త్వరగా నాకు విడాకులిచ్చేదేమో. నాకు బిడ్డల్నిచ్చి, నా మనవల్ని ఎత్తుకొని పెంచి నేను రాసిన చెత్తంతా మహాకావ్యమనుకొనే భార్య నాకు కావాలి. ఎదురుగా తడిబట్టలు ఆరేస్తున్న మా ఆవిడతో నాలాంటి బలహీనుడిని పెళ్ళి చేసుకున్న విచారపు ఛాయలేమి కనిపించలేదు. చంపల దగ్గర నెరిసే జుత్తూ, ఉదయపు వెలుగులో కెంపులాగ మెరిసే ఎర్రటి బొట్టూ ఆవిడ ఠీవిగా కనిపిస్తోంది. నా బలహీనతలు తెలిసి భరించడమే ఆవిడ బలమేమో.

కాని శ్రీకంతయ్య సరస్వతి మధ్యనయినా ఈ కోల్డువార్ ఎంతకాలం సాగుతుంది. ఈ బాంధవ్యం ఎలా పర్యవసిస్తుందన్న ఆలోచన పాతికేళ్ళ పాతది. కొత్త పొరపాట్లు ఎప్పటికప్పుడు చేయడానికి శ్రీకంతయ్య అలసిపోతే! ఆమె అభిమానంతో తన ప్రవర్తనకి ఒక అందమయిన సమన్వయాన్ని సాధించగలిగితే! సాధించానని నెలరోజుల క్రిందటే రాశాడు శ్రీకంతయ్య. నేను ఆశ్చర్యపోయాను. ఇంతలో ఈ ఉత్తరం! సరస్వతి కళ్ళు మూసిందని ఈసారి ఎక్కువ ఆశ్చర్యపడలేదు.

సరస్వతి గుండెలో రక్త ప్రసారానికి అడ్డుపడింది కొలెస్ట్రాల్ అని డాక్టర్లు అనవచ్చు. కాని తాను అడ్డుపడడానికి అవసరమయిన తిరుగుబాటు భర్త జీవితంలో లోపించడమని నా ఉద్దేశం.

సరస్వతి ఏదో దారిపక్క చెట్టుకి పూసి రాలిపోయే చిన్నగడ్డిపువ్వే కావచ్చు. కానీ ఆ పువ్వులో అనుక్షణం తనని తాను అలంకరించుకోడానికి జరిగే అపూర్వమయిన సంఘర్షణ ఉంటుంది. అది ఆగిపోయాక పువ్వుకి అందం పెరగదు. రాలిపోతుంది.

అలాగే రాలిపోయింది.

శ్రీ కంతయ్య ఉత్తరానికి సమాధానం రాస్తూ ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్న నాకు ఇప్పటికి సమాధానం దొరికింది.

(ఆంధ్రజ్యోతి, దీపావళి 1975)

----